క్లుప్తంగా

స్థానిక ఎన్నికల్లో పోటీకి సిద్ధమవ్వండి : జూలకంటి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు పోటీకి సిద్దంగా ఉండాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తక్కెళ్లపాడులో సీపీఎం సీనియర్ నాయకుడు మైనం కిషన్‌రావు 35వ వర్ధంతి సభ నిర్వహించగా ఆయన పాల్గొని స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వాటిపై అధ్యయనం చేస్తూ పరిష్కారం కోసం అధికారులపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రవినాయక్, చౌగాని సీతారాములు, మల్లు గౌతంరెడ్డి, వెంకన్న, నాగయ్య, సైదమ్మ, రమేష్, భిక్షం, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : అవంతీపురం సబ్‌స్టేషన్‌కు వచ్చే 33కేవీ ఫీడర్ లో లూసుగా ఉన్న లైన్ కింద పోల్స్, ఎరక్షన్ పనుల నేపథ్యంలో ఆదివారం అవంతీపురం విద్యుత్‌సబ్‌స్టేషన్ విద్యుత్ సరఫరాలో అంతరాయ ఏర్పడుతుందని ఏఈ బి అమర్‌సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో ఉండదని పేర్కొన్నారు. అవంతీపురం బాదలాపురం, ఆళగడప, సుబ్బారెడ్డి గూడెం, రాయినిపాలెం, జాల్బాయితండా, ములకలకాల్వ గ్రామాల పరిధిలో ఉన్న వ్యవసాయ రైతులకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాల ని కోరారు.

అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

దేవరకొండ : మండలంలోని పెంచికల్ పహాడ్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో పీజీటీ మ్యాథమెటిక్స్-1, పీజీటీ జువాలజీ-1 పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం. ఆశీర్వాదం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తగిన అర్హతలు కలిగిన ఉపాధ్యాయ అభ్యర్థులు తమ పూర్తి బయోడేటాతో 1వ తేదీ ఉదయం 10 గంటలకు డెమో క్లాసుకు హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు 'పింఛన్ విద్రోహ దినం'

హాలియా : నల్లగొండ కలెక్టరేట్‌లో సెప్టెంబర్ 1న జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'పింఛన్ విద్రోహ దినం' కార్యక్రమంలో ఉపాధ్యాయ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ అనుముల మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె సైయ్యద్ మియా, చింతపల్లి రవీందర్ శనివారం ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

నేత్ర దానంతో మరొకరికి ప్రాణదానం

మిర్యాలగూడ అర్బన్ : నేత్ర దానంతో మరొకరికి ప్రాణ దానం చేసిన వారవుతారని ఆర్గాన్ డొనేషన్ చైర్మన్ మిట్టపల్లి విజయభాస్కర రావు అన్నారు. శనివారం మిర్యాలగూడ పట్టణం అశోక్‌నగర్‌కు చెందిన మోదుగు ధనమ్మ మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులు నేత్రాలను దానం చేసుందుకు ముందుకు వచ్చారు. దీంతో ఆమె నేత్రాలను డైమాండ్ నేత్ర నిధి సేకరించి హైదరాబాద్‌లోని అగర్వాల్ ఆస్పత్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐ టెక్నీయన్ బచ్చలకూరి రమేష్ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

చందంపేట : నేరెడుగొమ్ము మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌ను శనివారం డీపీఓ వెంకయ్య పరిశీలించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే పోలింగ్ బూత్‌ల సంసిద్ధతపై బూత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించిన సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ వాణి, తహసీల్దార్ ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వరం

చందంపేట : పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వరమని మాజీ ఎంపీపీలు గోవిందుయాదవ్, ముత్యాల సర్వయ్యలు పేర్కొన్నారు. శనివారం చందంపేట మండలంలోని కంబాలపల్లి గ్రామంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేసి ఇంటి నిర్మాణ శంకుస్థాపన పనుల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చిముట ముత్తయ్య, ముత్యాల కొండల్, రంగయ్య, శశి, శ్రీరాములు, అంజి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు

- డ్రెయినేజీలు ధ్వంసం, రోడ్లు ఆక్రమణలు
- ఇళ్ల మధ్య నిల్వ ఉంటున్న మురుగు
- ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు



బాపూజీనగర్‌లో డ్రెయినేజీని ధ్వంసం చేసి చేపట్టిన ఇంటి నిర్మాణం



బాపూజీనగర్‌లో రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణం

మిర్యాలగూడ : దినదినాభివృద్ధి చెందుతున్న మిర్యాలగూడ పట్టణంలో ఆక్రమణలు కొనసాగుతున్నాయి. ఎస్ఎస్పీ కాల్వలు, కాలనీల్లోని డ్రెయినేజీలు, రోడ్లను సైతం ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. కానీ మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ యాక్ట్ ప్రకారం రోడ్లు, డ్రెయినేజీలు వదిలి ఐదు ఫీట్ల సెట్‌బ్యాక్‌తో ఇంటి నిర్మాణాలను చేపట్టాల్సి ఉండగా ఏకంగా రోడ్లు, ఆక్రమించి నిర్మాణాలను చేపట్టడం మిర్యాలగూడ పట్టణంలో మామూలుగా మారింది. ఇటీవలే ఎస్ఎస్పీ కాల్వను సైతం ఆక్రమించి రిజిస్ట్రేషన్ చేయించుకోగా మున్సిపల్ పరిధిలో ఉన్న ప్లాట్లను చదును చేసి అమ్మకాలు చేపడుతున్నారు. అదే విధంగా పట్టణంలో 40ఏళ్ల క్రితం బాపూజీనగర్ కాలనీ ఏర్పాటు చేసుకున్నారు. అది ప్రస్తుతం ఏడో వార్డు పరిధిలో ఉంది. విశాలమైన రోడ్లతో ఈ కాలనీని ఏర్పాటు చేయగా ప్రస్తుతం అక్రమార్కులు దాన్ని కుదించేస్తున్నారు. 14ఫీట్లు ఉన్న రోడ్డును ఇరువైపులా 4 అడుగులు ముందుకు జరిగి ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో ప్రస్తుతం ఆరు ఫీట్ల రోడ్డు మాత్రమే మిగిలింది. ఆ రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రెయినేజీలను జేసీబీలతో ధ్వంసం చేసి నిర్మాణాలు చేపడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా నిర్మాణం చేపట్టాలంటే తప్పనిసరిగా మున్సిపల్ అనుమతి పొందాల్సి ఉంది. కాని దానికి విరుద్ధంగా అక్రమ కట్టడాలు వెలుస్తున్నా దాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. బాపూజీనగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు ఇళ్ల వద్దనే చేరి రోగాల భారీన పడే ప్రమాదం ఉంది. డ్రెయినేజీ, రోడ్డు ఆక్రమణపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు. తక్షణమే ఆక్రమణలను తొలగించి డ్రెయినేజీ రోడ్డు వ్యవస్థను మెరుగుపరచాలని కాలనీవాసులు పేర్కొంటున్నారు.

డ్రెయినేజీ సమస్యతో ఇబ్బందులు



అక్రమ కట్టడాలు, ఆక్రమణలతో డ్రెయినేజీ , రోడ్డు పూర్తిగా కుదించుకుపోయింది. ద్విచక్ర వాహనం తప్ప ఆటో కూడా వచ్చే పరిస్థితి లేదు. మురుగునీరు మొత్తం ఎవరి ఇళ్ల వద్దనే చేరిపోయి రోగాల భారీన పడే ప్రమాదం ఉంది. తక్షణమే అక్రమ కట్టడాలను తొలగించి డ్రెనేజీ వ్యవస్థను మెరుగుపరచాలి. – బత్తుల కొండమ్మ, బాపూజీనగర్

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు



అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం. రోడ్లు, డ్రెయినేజీ, మున్సిపల్ స్థలాల్లో ఎలాంటి ఆక్రమణలు చేపట్టినా మా దృష్టికి వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటాం. సదరు వ్యక్తులపై మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– జి. శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి పత్యానాయక్

మిర్యాలగూడ : ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి పత్యానాయక్ అన్నారు. శనివారం దామరచర్ల మండలంలోని బొత్తలపాలెం ఆదర్శ పాఠశాల, బాలికల హాస్టలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన ఆహారం అందించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాకాలంలో దోమలు, ఈగలు విజృంభించకుండా పాఠశాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, మూత్రశాలలు, స్నానపు గదులు ప్రతిరోజు శుభ్రం చేయాలని, బాలికల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. సిలబస్‌ను పూర్తి చేసి విద్యార్థుల విద్యాభ్యాసన స్థాయిని పెంచాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఆయన వెంట ఎంఈఓ బాలాజీనాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహానికి ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి



వినాయక విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మిర్యాలగూడ అర్బన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయంబర్స్‌మెంట్ విడుదల చేసేలా ప్రభుత్వానికి జ్ఞానోదయం అయ్యేలా చూడాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినూత్నంగా వినాయకుడి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు ముడావత్ జగన్ నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారని నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. విద్యారంగంపై ప్రభుత్వ తీరు మారాలని లేకుంటే విద్యార్థులను సమీకరించి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, తరుణ్, కార్తిక్, బాబు, సాయి పాల్గొన్నారు.

ప్రముఖ వైద్యుడు రాములునాయక్ మృతి



రాములునాయక్(ఫైల్)



రాములునాయక్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎస్.రాములునాయక్(57) శనివారం కార్డియాక్ అరెస్ట్‌తో మృతి చెందాడు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కార్డియాక్ అరెస్ట్‌కు గురై తుదిశ్వాస విడిచారు. రాములునాయక్ దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా 15ఏళ్లకు పైగా సేవలందించారు. ఆస్పత్రికి వచ్చే ఎంతో మంది రోగులకు మెరుగైన సేవలు అందించి ఉత్తమ వైద్యుడిగా ఆయన పలు అవార్డులు అందుకున్నారు. పట్టణంలో ఆస్పత్రి ఏర్పాటు చేసి ఎంతో మంది పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్యం అందిచారు. ఆయన అకాల మరణ వార్త తెలుసుకున్న పట్టణ ప్రముఖులు, ప్రజలు పెద్ద ఎత్తున ఆయన నివాసానికి చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆయన మృతదేహంపై పూలమాలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రాములునాయక్ మృతి దేవరకొండ ప్రాంతానికి, వైద్య రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ రాములునాయక్ మృదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రాంతీయ ఆస్పత్రి వైద్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో డా.రవిప్రకాశ్,డా. వేణుధర్‌రెడ్డి, డా.కృష్ణ,మోతీలాల్, మంగ్తానాయక్, సిరాజ్‌ఖాన్, ఆలంపల్లి నర్సింహ, బంజార సేవా సంఘం నాయకులు,వివిధ పార్టీల నాయకులున్నారు.

త్రిపురారం గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయం

- సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

త్రిపురారం : బీఆర్ఎస్ కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేస్తే త్రిపురారం గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయని సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్, మాజీ ట్రికార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాసరెడ్డి నివాసంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు పాటించాలని పద్ధతులపై ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నోముల భగత్ మాట్లాడుతూ.. పార్టీ ఆదేశానుసారం రిజర్వేషన్లు ఎం వచ్చిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. సాగర్ నియోజకవర్గంలో 4 జెడ్పీటీసీ స్థానాలు గెలుపునకు సిద్ధంగా ఉన్నాయని, మిగతావాటిపై దృష్టి సారించాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, అడక్ అధ్యక్షుడు పావనగుడ్ల వెంకటాచారి, కామర్ల జానయ్య, అనుముల శ్యాంసుందర్ రెడ్డి, సుశీల్ నాయక్, కలకొండ వెంకటేశ్వర్లు, వనజ, నగిరి శ్రీనివాస్, జంగిలి శ్రీనావాస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ విద్య అందేలా ఏఐఎస్ఎఫ్ పోరాటం



హాలియా : మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళి కృష్ణ

హాలియా : అందరికీ విద్య అందాలనే లక్ష్యంతో ఏఐఎస్ఎఫ్ సంఘం పోరాడుతుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ముదిగొండ కృష్ణ అన్నారు. శనివారం హాలియా పట్టణంలో ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఏఐఎస్ఎఫ్ ఎంతో కీలక పాత్ర పోషించిందన్నారు. పోరాటాలు, త్యాగాలే ధ్యేయంగా ఏర్పాటైన ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం స్వాతంత్ర్యనంతరం ప్రభుత్వ విద్యా పరిరక్షణకు, శాస్త్రీయ విద్య, కామన్ విద్యా విధానం అములుపై నిరంతరం పోరాటాలు సాగిస్తూ 89ఏళ్లుగా విద్యార్థుల శ్రేయస్సు కోసం అశేష త్యాగాలు చేస్తూ ఆవిర్భావం నుంచి నేటి వరకు వరకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ శోభన్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ నాయకులు కొర్ర రమేష్, రమావత్ శ్రీధర్, వంశీ, నరేష్, రాజు, మౌనిక, అలేఖ్య, రంగా, గణపతి, రాజేశ్వరి, మల్లేశ్వరీ, మహేష్, చంద్రశేఖర్, రమేష్, పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పొప్పులను తెలపాలి



వేములపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్



దేవరకొండ : సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు

వేములపల్లి : తెలంగాణ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో ప్రదర్శించిన ముసాయిదా ఓటరు జాబితాపై ఎవరికైనా అనుమనాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సబ్ కలెక్టర్ నారయాణ్‌అమిత్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, పార్టీల నాయకులు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, చిర్ర మల్లయ్యయాదవ్, రెమడాల పరుశురాములు, కట్టా మల్లేష్‌గౌడ్, జడ రాములుయాదవ్, జిల్లా యాదగిరి, పెదమాం భరత్, వడ్డెగాని సైదులు, వెంకటేశ్వర్లు, వినోద్, జాన్సన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగులపల్లి : తెలంగాణ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వెలువరించిన ఓటరు జాబితా ముసాయిదాపై శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సంగీత ఓటరు జాబితాపై పార్టీల నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, నాయకులు నర్సింహ, రాజు, చింతకాయల సతీష్, శ్రీశైలం, బొమ్మకంటి నర్సింహ, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరు : పంచాయతీ ఎన్నికల సన్నాహకంగా ఎన్నికల ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీలతో ఎంపీడీఓ గుర్రం రమేష్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రమేష్ మాట్లాడారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నుంచి మండలపార్టీ అధ్యక్షుడు అంకతి సత్యం, బీజేపీ మండల అధ్యక్షురాలు పెందోటి శిరీషా, బీఆర్ఎస్ నాయకుడు నల్లబోతు వెంకటేశ్వర్లు, సీపీఎం నేత కొండేటి శ్రీను, కందుకూరి కోటేష్ పాల్గొన్నారు.

త్రిపురారం : ఓటరు లిస్టుల్లో అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని త్రిపురారం ఎంపీడీఓ విజయ కుమారి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామాల్లో ఓటరు లిస్టులో అభ్యంతరాలపై వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

చందంపేట : ఓటరు జాబితాలో తప్పొప్పులను సరిచూసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మి పేర్కొన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు కిన్నెర హరికృష్ణ, సాధిక్, సత్యనారాయణ, మోహన్‌కృష్ణ, బద్యానాయక్, సత్తిరెడ్డి, యాదయ్య, జంగయ్య, ఉప్పునూతల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

దేవరకొండ : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆయా రాజకీయ పార్టీలు సహకరించాలని దేవరకొండ ఎంపీడీఓ డానియల్ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటర్ల జాబితాకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల నాయకుల నుంచి ఆయన అభ్యంతరాలు స్వీకరించారు. ఈ సమావేశంలో నాయకులు జూలూరి గిరి, వెంకటయ్య ఉన్నారు.

సెప్టెంబర్ 2న తుది ఓటర్ జాబితా

తిరుమలగిరి(నాగార్జునసాగర్): గ్రామపంచాయతీ ఎన్నికకు సంబంధించి వార్డుల వారీగా రూపొందించిన ఓటర్ల తుది జాబితాను సెప్టెంబర్ 2న ప్రకటించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బిక్షంరాజు తెలిపారు. ఈనెల 28న విడుదల చేసిన ఓటర్ జాబితాపై అభ్యంతాలు స్వీకరించేందుకు శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అఖిలపక్ష నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలపై ఏమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే తెలపాలని సూచించారు.

అడవిదేవులపల్లి : తెలంగాణ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం డ్రాఫ్ట్ ఫోటోలు, ఓటరు లిస్టు, పోలింగ్ స్టేషన్లపై అన్ని రాజకీయ పార్టీలతో ఎంపీడీఓ మాతంగి రమేష్ సమావేశం నిర్వహించారు. అనంతరం రాజకీయ పార్టీల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మోసిన్‌బిన్ అహ్మద్, మాజీ ఎంపీపీ ధనావత్ బాలాజినాయక్ తదితరులున్నారు.

పెద్దవూర : స్థానిక సంస్థల ఎన్నికలకు వివిధ రాజకీయ పార్టీలు సహకరించాలని ఎంపీడీఓ ఉమాదేవి తెలిపారు. ఈనెల 28న విడుదల చేసిన ఓటర్ జాబితాపై శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అఖిలపక్ష నాయకుల సమావేశం నిర్వహించారు.

కొండమల్లేపల్లి(చింతపల్లి) : రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే సమర్పించాలని డీఎల్‌పీఓ శంకర్ నాయక్, ఎంపీడీఓ సుజాత పేర్కొన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో ఎంపీఓ ప్రవీణ్, శ్రీధర్, నాగభూషణ్, నగేష్, రవి ఉన్నారు.

ఎంపీడీఓకు వినతి

చింతపల్లి మండలంలోని వర్కాల గ్రామపంచాయతీ 1987లో ఏర్పడినప్పుడు 8 వార్డులుగా విభజించారని,అప్పటి నుంచి 8వ వార్డులో నమోదులో ఉన్న సుమారు 70మంది ఓటర్లను 8వ వార్డు నుంచి తొలగించి వారి ఇళ్లకు సంబంధం లేని ఐదో, ఆరో వార్డులకు బదిలీ చేసి తప్పుగా నమోదు చేశారని, అలాగే పంచాయతీ కార్యదర్శి కాంగ్రెస్ కార్యకర్తగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపిస్తూ ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు.

రిజర్వేషన్లపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలి

మిర్యాలగూడ టౌన్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులు గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్లపై రాజకీయ పార్టీలు కపట ప్రేమను చూపిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతంపై రిజర్వేషన్లలపై తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని చెబుతున్న ప్రభుత్వం కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తీసుకురావడం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శిరసినవాడ నర్సింహ, వెంకటాచారి, శివరామకృష్ణ, తదితరులున్నారు.

రైతులను వెంటాడుతున్న యూరియా కష్టాలు



పీఏసీఎస్‌లో యూరియా కోసం బారులుదీరిన రైతులు

త్రిపురారం : మండల వ్యాప్తంగా గ్రామాల్లోని రైతులకు యూరియా అందకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. శనివారం త్రిపురారం పీఏసీఎస్‌కు యూరియా వస్తుందని తెలుసుకున్న రైతులు వివిధ గ్రామాల నుంచి వచ్చి ఉదయం ఆరు గంటల నుంచి బారులుదీరారు. ఎక్కువ మొత్తంలో రైతులు రావడంతో పీఏసీఎస్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల పర్యవేక్షణలో ప్రతి ఆధార్ కార్డుకు 3బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. వరుసలో చివరి రైతులకు యూరియా అందకపోవడంతో పలువురు రైతులు నిరాశగా ఎదురు చూస్తున్నారు. మండలంలో త్రిపురారం, పెద్ద దేవుల పల్లి, బాబుసాయి పేట గ్రామాల్లో పీఏసీఎస్‌లతో పాటు మండల కేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాలు ఉన్నా యూరియా కొరత రావడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో యూరియా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉత్తమ సేవలతోనే ప్రజల్లో గుర్తింపు



కొండమల్లేపల్లి : ఎంపీడీఓగా ఉద్యోగ విరమణ చేసిన బాలరాజురెడ్డి దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

కొండమల్లేపల్లి : ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించినప్పుడే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌లు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కొండమల్లేపల్లి ఎంపీడీఓ ఉద్యోగ విరమణ సన్మానోత్సవంలో కలెక్టర్, ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం బాలరాజురెడ్డి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీసీఈఓ శ్రీనివాసరావు, డీఆర్‌డీఓ పీడీ శేఖర్‌రెడ్డి, ప్రతీక్ రెడ్డి, ఫౌండేషన్ చైర్మన్ సలహాదారుడు గన్నారెడ్డి, మాజీ ఎంపీపీ రేఖాశ్రీధర్‌రెడ్డి, ఉట్కూరి వేమన్‌రెడ్డి, మాజి సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



గుర్రంపోడు : యాదయ్య దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గుర్రంపోడు : మండలంలోని పిట్టలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎం నకిరేకంటి యాదయ్య ఉద్యోగ విరమణ సన్మానం శనివారం పాఠశాలలో నిర్వహించారు. యాదయ్య దంపతులను పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు వక్తలు 36ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో యాదయ్య సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఎంఈఓ గోపిడి బిక్షంరెడ్డి, ఉపాధ్యాయులు కత్తి యాదగిరి రెడ్డి, వల్లపు సైదయ్య, అద్దంకి సునీల్‌కుమార్, దస్తగిరి, శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రేఖ, కమలమ్మ, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు

నిడమనూరు : ప్రతి ఉద్యోగికి ఉత్తమ సేవలతోనే గుర్తింపు లభిస్తుందని జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్ అన్నారు. నిడమనూరు మండల అభివృద్ధి అధికారి గుర్రం రమేష్‌ను ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం పలువురు సన్మానించారు. ఈసందర్భంగా పీడీ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఎంపీడీఓగా రమేష్ ఎన్నో సేవలందించారని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా, ప్రభుత్వ పథకాలను సమర్థంతంగా అమలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కేవీ కృష్ణవేణి, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, ఎంఈవో వెంకన్న, సూపరింటెండెంట్ రమేష్, రాధాకృష్ణ, సంజయ్, ఎంపీవో, పలువురు కార్యదర్శులు లింగయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.